క్లుప్తంగా

సుపరిపాలనకు సచివాలయాలు దోహదం


కొండలింగాలవలసలో సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: గ్రామీణ స్థాయిలో సుపరిపాలన అందించేందుకు గ్రామ సచివాలయాలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొండలింగాలవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల కేంద్రాలకు గ్రామస్తులు వెళ్లే పని లేకుండా అన్ని రకాల పౌరసేవలు సచివాలయాల్లోనే అందుతున్నాయన్నారు. ప్రభుత్వం కూడా మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడి పోలమ్మ, ఎంపీటీసీ గుమ్మడి ప్రవీణ్, ఎంపీడీవో భానుమూర్తి, ఏపీవో చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు


ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: మండల కేంద్రంలోని సచివాలయంతో పాటు గజరాయునివలస గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో అందిస్తున్న సేవలను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆధార్ సేవలకు వచ్చే వారిపై విసుక్కోకుండా సకాలంలో వారి పని అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆరేళ్ల వయసులోపు చిన్నారులకు కొత్త ఆధార్‌కార్డులు చేయించుకోవాలన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన


బొబ్బిలి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చూపిస్తున్న లైబ్రేరియన్

తెర్లాం/బొబ్బిలి: మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం చేపట్టిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. పిల్లలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, పెద్దలకు ఉపయుక్తమైన పుస్తకాలను ప్రదర్శించారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్‌లు కోరారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం కలుగుతుందన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ మంగళవారం చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, దోమల నివారణ మందు స్ప్రే చేశారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు దోమకాటు వల్ల కలుగుతాయని, అనవసర నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజరు రమణ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో నవధాన్యాల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో వేసుకుంటే చాలా మంచిదని, నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణలు తెలిపారు. అనంతరం రబీ డ్రై సోయింగ్‌ను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు ముద్దలమ్మ, మాజీ ఎంపీటీసీ సవలాపురపు నర్సింహప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న దేవతామూర్తుల బల్లవేషాలు




ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వేషధారణలు


సిరిమానును పూజిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

వైభవంగా దాడితల్లి సిరిమానోత్సవం


సిరిమానుపై ఊరేగుతున్న పూజారి

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు దాడితల్లి సిరిమానోత్సవం బొబ్బిలిలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఏ దారి చూసినా భక్తులతో నిండుగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దర్శనమిచ్చింది. సిరిమాను ఊరేగింపు ఆద్యంతం చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – బొబ్బిలి


సిరిమాను ఊరేగింపును తిలకిస్తున్న ప్రజలు

సారా రహిత గ్రామాలే లక్ష్యం



సారా రహిత గ్రామాలే లక్ష్యమని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు అన్నారు. నవోదయం 2.ఓ కార్యక్రమంలో భాగంగా రామభద్రపురం మండలం, జోగిందొరవలస గిరిజన గ్రామంలో సారా నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇదే గ్రామంలో ఎక్కువగా సారా తయారు చేయడం వల్ల గ్రామాన్ని బి–కేటగిరీలో చేర్చి, సారా నిషేధంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మూడు నెలలుగా గ్రామంలో సారా తయారు చేసినట్లు గానీ విక్రయించినట్లు గానీ ఫిర్యాదులు అందకపోవడం చాలా సంతోషమన్నారు. ఈ మేరకు గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గొల్లపేట సర్పంచ్ కె.రమ్య, వీఆర్‌వో ఆనందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు. – రామభద్రపురం

రోడ్డుపైనే మురుగు..



రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో కాలువల ద్వారా వెళ్లాల్సిన మురుగునీరు..రోడ్డుపైనే ప్రవహిస్తోంది. కాలువలు పూర్తిగా పూడికలతో నిండిపోవడంతో ఆ నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దుర్గంధం(దుర్వాసన) భరించలేకపోతున్నామని, ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ పారిశుధ్య పనులు చేయించే అధికారులకు ఈ విషయం తెలియకుండా ఉంటుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మురుగు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – రాజాంసిటీ

'ఆశ'లు ఫలించాలని సమ్మె..



ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, మండల నాయకుడు గోపాల్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెర్లాం, పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశకార్యకర్తలు మంగళవారం నిరసన చేపట్టారు. కనీస వేతనం, ఇన్సూరెన్స్ తదితర డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని, అందరూ తమకు మద్దతు తెలపాలని ఆశ కార్యకర్తలు కోరారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వైద్యులకు సమ్మె నోటీసులు అందజేశారు. – తెర్లాం

నల్లరిబ్బన్లు ధరించి నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వంగర: ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పీల అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వంగర పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఎదుట ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు నల్లరిబ్బన్లు ధరించి, మంగళవారం నిరసన చేపట్టారు. ఎంఎల్‌హెచ్‌పీలు తమ హక్కుల సాధన కోసం ఇటీవల చేసిన ధర్నాలో మిగతా క్యాడర్(ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు) మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని గుర్తు చేశారు. తక్కువ చదువులు చదివిన ఏఎన్‌ఎంలకు రూ.50 వేలు, సూపర్‌వైజర్లకు రూ.70 వేలు ఇస్తున్నారని, ఉన్నత చదువులు చదివిన వారికి తక్కువ వేతనాలు ఇస్తున్నట్లు అనడం అవమానించడం కాదా అని ప్రశ్నించారు. విధుల నిర్వహణలో కూడా ఏఎన్‌ఎంల యాప్‌లు కూడా వారే చూస్తున్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. మరోసారి ఇలాంటి అవమానకర మాటలు ఆడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వీరికి ఆశవర్కర్లు మద్దతు తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ హేమస్రవంతి

బొబ్బిలి: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ హేమస్రవంతి పిలుపునిచ్చారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. దేశ భవిష్యత్ అయిన బాలలు..బాలకార్మికులుగా ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు, దుకాణాలు, షాపుల్లో పనిచేస్తున్న బాలలను గుర్తించి, వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. అలాగే రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. ముఖ్యంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలన్నారు. పని ప్రదేశంలో స్త్రీలను చిన్నచూపు చూడొద్దని, పురుషులతో సమానంగా వారిని చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకీరాం, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.మోహనరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సర్వేలు పూర్తి చేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: పెండింగ్ సర్వేలు పూర్తి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరుకావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. మనమిత్ర వాట్సాప్ సేవలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

కుట్టుమిషన్ల పేరుతో కూటమి స్కామ్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గరే రాము


మాట్లాడుతున్న రాము వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రాము

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలకు కల్పిస్తున్న కుట్టుమిషన్ల శిక్షణ కార్యక్రమం అంతా పెద్ద స్కామ్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గరే రాము ఆరోపించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పెరుమాళి గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఉన్న బీసీ మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టిందన్నారు. ఈ శిక్షణ పేరుతో టెండర్ల నుంచి శిక్షణ వరకు కోట్లాది రూపాయలు దోపిడీకి వీలుగా పథకం పన్నారన్నారు. అంతేకాకుండా కుట్టుమిషన్లు బ్రాండ్ ఇమేజ్ ఉన్నవి కాకుండా నాసిరకమైనవి కొనుగోలు చేయడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. కుట్టు మిషన్ల శిక్షణా పథకం ద్వారా కూటమి సర్కారు రూ.167 కోట్ల భారీ అవినీతికి తెరతీసిందన్నారు. బీసీ మహిళలకు న్యాయం జరిగేంతవరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు.


తెర్లాం: చిన్నయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు తులసి, రమాదేవి

కిశోర వికాసం.. భవితకు సోపానం!

వాడవాడలా కిశోర వికాసం 2.0 కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో కిశోర బాలికల వికాసంపై మంగళవారం అవగాహన కల్పించారు. కిశోర వికాసం..బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది అని, వ్యక్తిగత రుతుస్రావం–పరిశుభ్రత, బాలికా స్వేచ్ఛ–భద్రత, ఆరోగ్యం, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణా అరికట్టుట, బాల్యవివాహాల నిర్మూలన, లింగవివక్ష, స్వయం ఉపాధి తదితర అంశాలను ఐసీడీఎస్ పీవోలు వివరించారు. సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. – బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాం సిటీ: పొగిరిలో కిశోర బాలికలకు సూచనలిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది


బొబ్బిలిరూరల్: కోమటిపల్లిలో ఆరోగ్య సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి


రేగిడి: కొమెర సచివాలయంలో ఆరోగ్యసూత్రాలు తెలుపుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జానకి


రామభద్రపురం: బూసాయవలసలో కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం

సంక్షిప్తంగా...

ప్రశాంతంగా ఏపీఈసెట్ పరీక్ష

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో మంగళవారం నిర్వహించిన ఏపీఈసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 328 మంది హాజరుకావాల్సి ఉండగా, 10 మంది గైర్హాజరయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

వంగర: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సీహెచ్ జ్యోతి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో ఆరోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీసీడీ, ఈసీ సర్వేలపై సమీక్ష చేశారు. వేసవికాలం కావడంతో తాగునీటి ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగాలన్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి

రేగిడి: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని తాటిపాడు, వావిలవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుధ్య పనులపై దృష్టిసారించాలి

రేగిడి: ప్రతీ గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులపై దృష్టిసారించాలని ఎంపీడీవో శ్యామలాదేవి సూచించారు. మండలంలోని వన్నలి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. మురుగు కాలువల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని, ప్రజలు అనవసరంగా చెత్తాచెదారం వేయవద్దని తెలిపారు.

ఘనంగా పైడితల్లి సిరిమానోత్సవం


కారాడలో సిరిమాను ఊరేగింపులో భక్తజనం

బొబ్బిలిరూరల్: మండలంలోని కారాడ గ్రామంలో పైడితల్లి సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని తనివి తీరా దర్శించి, మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే బేబీనాయన ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.